# సమ్మతం

ఈమధ్య ఒకరోజు మధ్యాహ్నం మిత్రులం కొంతమంది సరదాగా అవీ ఇవీ మాట్లాడుకుంటున్నాం. ఒక అరగంట సరదాగా నడిచింది. అప్పుడే వచ్చారు సురేష్, సురేష్ నాన్నగారు. ఆయన ఇండియానించి వచ్చి నాలుగు రోజులయింది. ఇండియా గురించి కొత్త కబుర్లు విన్నాక, ఆయన అన్నారు. 'మీ కథలన్నిటిలోనూ నాకిష్టమైనది మతమా నీ విలువెంత? అన్న కథ' అని.

కుతూహలంతో అడిగాను 'ఎందుకని?' అని.

ఆయన నవ్వుతూనే అన్నారు 'నేను మత ఛాందసుడినే అయినా, నాకు అందులో నచ్చిన అంశం ఒకటి వుంది. మతం ఏదైనా కూడా, విశాలమైన మానవత్వానికి విలువ ఇవ్వాలని' అన్నాడాయన.

దాంతో ఆ రోజు చర్చ మతం అనే విషయం మీదకి మళ్ళింది.

'సర్వ ప్రాణ కోటినీ రక్షించేది కృష్ణభగవానుడే అంటారు కదా. ఆయనే చూసుకోడూ ఈ కష్టాల్లో వున్న జనాన్ని' అన్నాడు కృష్ణ.

'మానవ సేవే మాధవ సేవ. ఎదురుగుండా మనుష్యులు చస్తుంటే వాళ్ళకి సహాయం చేయాలి కానీ, మళ్ళీ కృష్ణుడి ద్వారా ఎందుకు కృష్ణా' అన్నాడు మాధవ్ నవ్వుతూ.

ఏదో పెద్దమనిషి ఆ మాట తన అభిప్రాయంలాగానే చెప్పినా, మనం తెలుగువాళ్ళం కదా ఎప్పుడు ఎవరి మీద విరుచుకు పడదామా అని సిద్ధంగా వుంటాం కనుక, వెంటనే ఆలస్యం లేకుండా ఆ విషయం మీద వాదనలు మొదలు పెట్టారు. కాసేపట్లో వాతావరణం ఉద్రేక పూరితమయిపోయింది. వేడి వేడి కాఫీ తాగగానే ఇంకా కొంచెం వేడెక్కింది.

అవును. మతమనేది ఎప్పుడూ ఉద్రేకపూరితమైన విషయం. అందులోనూ మతప్రమేయంగా ఒకరి అభిప్రాయాలకి భిన్నంగా వినపడితే అది ఇంకా ఉధృతమవుతుంది. పరిశీలన, విచక్షణా జ్ఞానం అన్నవి వెనకడుగు వేస్తాయి.

0 0 0

ఎన్నో మతాలూ, ఇంతమంది దేవుళ్ళూ వున్న ఈ భూప్రపంచంలో ఏ మతం సమ్మతం? అన్ని మతాలూ సమ్మతమే అయితే ఈ ఉద్రేకాలెందుకు? ఈ విషయం మీద రకరకాల అభిప్రాయాలూ చర్చలూ విన్నాను. ఆరోజు కూడా అలాటి చర్చే మొదలయింది. ఇక్కడ చెప్పవలసిన విషయం ఏమిటంటే అంతకు ముందు రోజే మేమొక సెమినార్‌కి వెళ్ళాం. మాట్లాడింది ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్. ఆయన ఆర్యులు ఇండియాకి వచ్చారా, అసలు మొదటే ఇండియాలోనే వుండేవారా, ఇంగ్లీషు వాళ్ళు వ్రాసిన మన చరిత్రకీ మనం వ్రాసుకొని మన చరిత్రకీ తేడా లెక్కడ వున్నాయి మొదలైన విషయాల మీద ఇరవై ముప్ఫై పుస్తకాలు వ్రాసిన ఇండియన్ అమెరికన్ ప్రొఫెసర్. ఈ విషయాల గురించి ఇంకోసారి వ్రాస్తాను. కానీ ఆయన

చెప్పిన ఒక విషయం ఈ చర్చకి పనికివస్తుంది. అందుకని అదేమిటో చెబుతాను. మోక్షం రావాలంటే మనిషి తన మనసుని భవలోకబంధాలనించి వేరుచేసి పై పరిధుల్లోకి వెడితేనే వస్తుంది అని. తర్వాత ప్రశ్నలూ జవాబులూ జరుగుతున్నప్పుడు నేనో ప్రశ్న అడిగాను. మనసుని రోజువారీ బంధాలనించీ విడుదల చేసుకోవలసిన మనిషి, అలా చేయకుండా ఆచారాలూ తంతులూ (రిట్యుయల్స్) అనే వాటిలో ఇరుక్కుపోతున్నాడు కదా, మరి ఆ మనిషికి మోక్షం వస్తుందా అని. ఆయన చెప్పిన జవాబు... చూద్దాం ఈ వ్యాసంలో ఎక్కడయినా కనిపిస్తుందేమో!

అంతేకాదు ఈ వ్యాసం చదివేవాళ్ళు కూడా తమ తమ మతాలనీ, నమ్మకాలనీ, ఉద్రేకాలనీ కొంచెం దూరంగా వుంచి, అన్ని పక్కలనించీ విశాలంగా ఆలోచిస్తే ఇది వ్రాస్తున్న నాకూ, చదువుతున్న మీకూ బాగుంటుంది.

0 0 0

మన మధ్య ఏ మతాన్నైనా సరే మనసా వాచా పాటిస్తున్నవారు, మతాన్ని మూఢంగా నమ్మేవారు, అసలు మతం మీద నమ్మకం లేనివారు, కొంతమంది అసలు/నకిలీ మతగురువులు (లేదా స్వామీజీలు, బాబాలు) ప్రతి రోజూ ప్రతి చోటా కనిపిస్తూనే వుంటారు. మతాలను నమ్మేవారిలో రకరకాల మతాలు వున్నాయి. సంఖ్యాపరంగా చూస్తే, క్రిష్టియన్లు 2.1 బిలియన్లతో మొదటి స్థానంలో వున్నారు. తర్వాత 1.3 బిలియన్ల ముస్లిములు రెండవ స్థానంలో వున్నారు. 900 మిలియన్ల హిందువులు మూడవ స్థానమైతే, బౌద్ధవులూ, సిక్కులూ, జ్యూలూ, బహాయ్‌లూ, జైనులూ, షింటోలూ, కావ్‌లూ, జొరాష్ట్రియన్లూ మొదలైన వారు మిగతా మతాలవారు. వీటిల్లో ఈనాడు అతి వేగంగా పెరుగుతున్న మతం ఇస్లాం.

అసలు మతమే లేదనీ, వద్దనీ, దేవుడే లేడనే వారి సంఖ్య చాల పెద్దది. 1.1 బిలియన్ల పైన.

ఇలా ప్రపంచంలో ఇన్ని రకాల మతాలుండటం వల్ల, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకంగా వుండటం వల్ల, అది ఒక ప్రాంతానికో సంస్కృతికో పరిమితమైన నమ్మకంగా మొదలైందని తెలుస్తున్నది. కాలక్రమేణా ఆ మతాలు ఇతర ప్రదేశాలకి కూడా పాకాయి. అలాగే మతం లేదనేది కూడా ఒక నమ్మకమేనని వాదించే వాళ్ళున్నారు. మతం నల్లమందులాటిదన్నాడు మార్క్స్. మతం అన్నది మనిషి సృష్టించుకున్నదేననీ, మనిషి మనుగడ కది అనవసరమనీ హేతువాద దృష్టితో చేసిన వాదనలు కూడా వున్నాయి. ఆ విషయాన్ని ఎవరి నమ్మకాలకి వాళ్ళకి వదిలేస్తున్నాను.

ఏ మతమైనా మంచి చేయమని చెబుతుంది. జీవితపు అర్థాన్ని, మానవతా విలువల్నీ గుర్తుచేస్తుంది. మనిషిని మనిషిగా బ్రతకమంటుంది. నేను సర్వ మత గ్రంధాలూ చదవకపోయినా గీత, బైబిల్ (న్యూ టెస్టమెంట్), ఖురాన్లో కొన్ని భాగాలూ, బహాయ్‌లో కొన్ని పేజీలు చదివాను. నా పరిమిత జ్ఞానంలో ఏ మతమూ ఎక్కడా జనాన్ని చంపమనీ, నరకమనీ చెడ్డ బోధనలు చేసినట్టు కనపడలేదు. మరి ఒక మతానికీ ఇంకొక మతానికీ మధ్య ఎందుకీ వైషమ్యాలు. ద్వేషాలు. మారణ హోమాలు. మతాన్ని మనసా వాచా పాటించే వాళ్ళు చేయదగ్గవా ఇవి? అదేనా వారి

మతం చెబుతున్నది. అలా అయితే ఆ మతం సమ్మతమెలా అవుతుంది?

గత వందేళ్ళ ప్రపంచ చరిత్రలో మత కలహాలు విపరీతమైనాయి. ప్రగతి పథంలోకి వెళ్ళిన మానవాళికి అదొక మాయని మచ్చ. హిట్లర్ జ్యూయిష్‌వారిని మత ద్వేషంతో లక్షల్లో నరికి పోగులుపెట్టటం కసాయి హృదయాలని కూడా కలిచి వేస్తుంది. 1947లో మొదలయిన హిందూ ముస్లిం మారణహోమాలు లక్షల మందిని పొట్టనపెట్టుకుని, ఇంకా కొనసాగుతూనే వున్నాయి. అలాగే వెస్ట్ బాంక్‌లో ఇజ్రాయిల్-పాలస్తీనాలకు రోజువారీ జరుగుతున్న యుద్ధకాండ. ఇవన్నీ రాజకీయ ప్రహసనాలా? మత కలహాలా? రాజకీయ కారణమైనవయితే, మతం పేరుతో ఎందుకు జరుగుతున్నాయి? ఇవి జరుగుతున్న ప్రతి చోటా మత గురువుల, మత నాయకుల, ప్రవక్తల అంగీకారమో, ప్రేరణో కనిపిస్తూనే వుందే! మరి అదేమిటి. మతం మంచే చేయమని చెబుతుంటే, మరి ఈ గురువులు లఘువులుగా ఎందుకు మారిపోతున్నారు? వీళ్ళు గురువులా? గురివింద గింజలా?

దానికి మళ్ళీ ఇంకొక జవాబు. మత గ్రంధాల్లో వ్రాసి వున్నదానికీ, మతం పాటించేవారి అవగాహనకీ వున్న తేడా వల్ల అలా అవుతున్నదని. 'మీరు చేయవలసిన మానవ ప్రయత్నం మీరు చేయండి. దాని ఫలితాలు నాకు వదిలేయండి' అని కృష్ణుడు అంటే, రెండు కొబ్బరికాయలతోనో, తిరుపతి యాత్రతోనో పరీక్షలకి చదవకుండా ఫలితాలను రాబట్టుకుందా మనుకునేవారూ, చేసిన హత్యలు దేవుడికిచ్చే లంచంతో దాచేద్దామనుకునేవాళ్ళు అలా అర్థం చేసుకున్న మతం. ఎదుటి మనిషి ఆకలితో చచ్చిపోతున్నా లెఖ్ఖ చేయక కృష్ణా నదిలో డబ్బులు కృష్ణార్పణం అని నీళ్ళపాలు చేసే వారి అనువాదం అది.

సర్వమూ నేనే అంటే, అది కృష్ణుడే అని వాదించి మిగతా మతాలవారిని చిన్నచూపు చూడమని కాదు. అలాగే మీరందరూ పాపులుగా పుట్టారు కనుక, మిమ్మల్ని ఏసుప్రభువే రక్షించాలి కనుక, మా మతమే సమ్మతమని మతాల మార్పిడి చేసే కిరస్థానీయులు. అలాగే ఇస్లాం మతానికి చెందనివారికి జీవించే హక్కు లేదనే వాదనా - ఇవన్నీ ఆ మతాలంటే సరైన అవగాహన లేని మతరాజకీయవాదుల స్వార్థపర స్వయం భాష్యాలని నాకు అనిపిస్తున్నది.

మతాలు వేరైనా అవన్నీ మానవత్వపు విలువలని సూచించేవే అని ఇంకొక జవాబు. అలాటప్పుడు ఏ మతమైనా సరే, ఆ మత పరిధుల్లోనించి బయటికి వచ్చి సాటి మనిషికి సహాయం చేయవచ్చు కదా!

మరి మాధవ్ అన్నట్టుగా మానవ సేవే మాధవ సేవ అయితే, ఆ మానవ సేవే చేసి మానవత్వపు విలువలని కాపాడుకోవచ్చుకదా! ఆచార వ్యవహారాల తంతుల ముసుగులో, మతం పేరుతో చేయాలా అని కొందరి ప్రశ్న.

ఇవన్నీ వింటుంటే ఆ రోజు చాలమందికి వచ్చిన ప్రశ్న - 'మతమా నీ విలువెంత?' అని.

0 0 0